సాక్షి
పల్నాడు

బుధవారం । 8 । జనవరి । 2025

I



పాఠశాలలో జిల్లా కలెక్టర్ తనిఖీ
నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను మంగళవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 565 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.

ప్రసన్నాంజనేయునికి పూజలు



భట్టిప్రోలు: మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో ఉన్న వేణు గోపాలస్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామికి మంగళవారం రాచూరు జమిందారు సహకారంతో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, డీఈఓ, ఎల్‌జీఎస్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తగు ధ్రువపత్రాలతో ఈనెల 7 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడటౌన్–వికారాబాద్(07205) ప్రత్యేక రైలు ఈనెల 9న కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. వికారాబాద్–శ్రీకాకుళం రోడ్డు(07207) ప్రత్యేక రైలు ఈనెల 10న సాయంత్రం ఐదు గంటలకు వికారాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07208) ప్రత్యేక రైలు ఈనెల 11న శ్రీకాకుళం రోడ్డు వద్ద మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

స్కౌట్స్‌తో దేశభక్తి, సేవాభావం పెంపు

గుంటూరు డీఈవో సీవీ రేణుక



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ శిక్షణ దోహదం చేస్తుందని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు బిగినర్స్ కోర్స్ ఫర్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో రేణుక మాట్లాడుతూ క్రమశిక్షణ, పరోపకారం, సోదరభావం పెంపొందించడంలో తోడ్పడుతుందని, ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ చేయాలని సూచించారు. స్కౌట్స్, గైడ్స్ ఎస్‌ఓసీ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి చంద్రిక, ఎం.శ్రీహరి, పి.నరేష్ పాల్గొని శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ సీహెచ్ రమేష్‌ను సత్కరించారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ డి. మధుసూదనరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 7వ తేదీతో ముగిసిందని చెప్పారు. దీంతో ప్రభుత్వం మరో ఐదురోజులు పొడిగించిందని వివరించారు. 12 వరకు స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం అన్ని తనిఖీలూ పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వివరించారు.

యార్డుకు 76,310 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 72,819 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 15,500 వరకు ధర పలికింది.

మీకో దండం బాబు..!

నిర్మాణదారులు డబ్బులు పెట్టినా ఇసుక అందించలేని దుస్థితిలో సర్కార్

ఉచితంగా ఇసుక సరఫరా అంటూ కూటమి ప్రభుత్వం ఊదరగొడుతున్నా, అందుబాటులో లేక సామాన్యులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక కూడా ఊడిందన్న చందాన కూటమి ప్రభుత్వ ఉచిత ఇసుక సరఫరా విధానం ఉంది. మరోవైపు ఇసుక రీచ్‌లు మూతపడటంతో వాటిపై ఆధారపడిన వేల మంది కార్మికుల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయి. ఇదే అదనుగా అక్రమంగా తరలిస్తున్న వారు అడ్డగోలు ధరలు వసూలు చేస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు.

- అచ్చంపేట మండలానికి నాలుగు రీచ్‌లు మంజూరు
- రెండు చోట్ల కార్యకలాపాల నిలిపివేత
- నిబంధనలు పాటించలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- కనీసం ప్రారంభానికీ నోచుకోని మరో రెండు
- ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ కార్మికులు, పడవల యజమానులు



అంబడిపూడి రీచ్‌లో పెద్ద యంత్రాలను వినియోగించడంతో అడ్డుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు (ఫైల్)

అచ్చంపేట: అచ్చంపేట మండలంలో కూటమి ప్రభుత్వం నాలుగు ఇసుక రీచ్‌లను మంజూరు చేసింది. భారీ యంత్రాలతో తవ్వకాలు నిర్వహిస్తున్నారని అధికారులు దాడులు చేయడంతో అంబడిపూడి–1 రీచ్ మూతపడింది. కృష్ణానదికి అడ్డంగా రెండు కిలోమీటర్లు పొడవున రోడ్డు వేసి ఇసుక తవ్వేందుకు యత్నించగా కోనూరు రీచ్‌ని కూడా మూసేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం నిర్వహించాలంటే తమ వల్ల కాదని, అధికారులు చూసీచూడనట్లు పోతేనే సాధ్యమని కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో మిగిలిన అంబడిపూడి–2, అంబడిపూడి–3 రీచ్‌లు ప్రారంభం కాలేదు.

ఉపాధి కోల్పోయిన కార్మికులు

దీంతో రీచ్‌లను నమ్ముకున్న వేల మంది కార్మికులు, పడవ యజమానులు రోడ్డున పడ్డారు. మండలంలోని కోనూరు, కస్తల, కోగంటివారిపాలెం, చామర్రు, మాదిపాడు, గింజుపల్లి, చింతపల్లి, అంబడిపూడి తదితర గ్రామాలకు చెందిన రెండు వేల మందికిపైగా కార్మికులు ఇసుక తరలింపుపై ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. నది లోతుల్లోనుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చేందుకు కస్తల, కోనూరు, మాదిపాడు గ్రామాలలో సుమారు 400కుపైగా పడవలు ఉన్నాయి. నాలుగు రీచ్‌లు ఒకేసారి మూతపడటంతో కార్మికులు, పడవల యజమానులు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నది లోతుల్లోనుంచి కార్మికులు ఇసుకను తోడి పడవల ద్వారా ఒడ్డుకు చేర్చినందుకు కాంట్రాక్టరుకు ప్రభుత్వం క్యూబిక్ మీటరుకు రూ.108 చొప్పున చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ టెండర్లు పిలిచింది. నియోజకవర్గంలోని పొందుగుల, అంబడిపూడి–1 రీచ్‌లలో రూ.54.99కే మిస్సర్ గోదావరి కృష్ణా వాటర్ వర్క్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ టెండర్లు దక్కించుకుంది. కానీ భారీ యంత్రాలను ఉపయోగించింది. పరిమితిని మించి ఇసుకను తవ్వి రవాణా చేశారు. కూటమిలోని మరో వర్గం వారు ఫిర్యాదులు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు దాడులు చేసి అయిదు పెద్ద యంత్రాలను, లోడ్ లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో రీచ్ మూతపడింది. కోనూరు ఇసుక రీచ్‌ను రూ.109కి బిడ్ ద్వారా దక్కించుకున్న మిస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సొల్యూషన్స్ ఏకంగా కృష్ణానదిలో రెండు కిలోమీటర్ల రోడ్డు వేసింది. కూటమిలోని వారే ఫిర్యాదు చేయడంతో రీచ్ ప్రారంభం కాకుండానే అధికారులు నిలిపివేశారు.

యథేచ్ఛగా రవాణా

ఇదే అదనుగా ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకునే అవకాశాన్ని అక్రమార్కులు అందిపుచ్చుకున్నారు. నదిలోకి వెళ్లడం, ట్రాక్టరుకు పైవరకు లోడ్ చేసుకుని బహిరంగంగా రవాణా చేస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారు. అమరావతి మండలంలోని పొందుగుల, దిడుగు రీచ్‌లను కూడా దక్కించుకున్న ఈ కాంట్రాక్టర్లే ట్రిబ్యునల్ నిబంధనలను పాతరేసి తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులను ప్రలోభాలకు గురిచేసి పెద్ద యంత్రాలను వినియోగిస్తున్నారు. అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ కేసులు పెట్టి వేధిస్తే మూల్యం తప్పదు

- టీడీపీ నాయకులను హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- అక్రమ కేసులో సబ్‌జైలులో ఉన్న సర్పంచ్, ఆయన సోదరులకు పరామర్శ
- వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను కాపాడుకుంటామని భరోసా



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రతిపక్షమైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ వారిని హెచ్చరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గంటా కోటేశ్వరరావు, ఆయన సోదరులను మంగళవారం గోపిరెడ్డి పరామర్శించారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ నాయకులైన కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గంటా కోటేశ్వరరావు, ఆయన సోదరులు గంటా కొండలు, గంటా చిన్న కోటేశ్వరరావులపై టీడీపీ వారు అన్యాయంగా, అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు పంపించారన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 35 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీవైపు ఉంటే.. కేవలం తొమ్మిది కుటుంబాల వారు టీడీపీలో ఉన్నారన్నారు. గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా కాలనీలోని చర్చిలో ప్రార్థనలకు వైఎస్సార్‌సీపీ వారిని రానీయకుండా టీడీపీ వర్గీయులు అధికార బలంతో అడ్డుకున్నారన్నారు. డిసెంబర్ 31వ తేదీన నూతన సంవత్సర ప్రార్థనలకు సైతం అడ్డుకున్నారని చెప్పారు. స్టేషన్‌కు ఎస్‌ఐ పిలిచి 31వ తేదీ రాత్రి 11 గంటలకు వరకు టీడీపీ వారు, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ వర్గీయులు ప్రార్థన చేసుకునేలా రాజీ చేశారని అన్నారు. టీడీపీ వారి ప్రార్థన ముగిసిన తర్వాత కూడా వైఎస్సార్‌సీపీ వారిని అడ్డుకున్నారని చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య చిన్న గొడవ జరిగిందన్నారు. ఇరువర్గాలపై 324 సెక్షన్ కేసు నమోదు చేశారని చెప్పారు. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు అంటే సుమారు ఎనిమిది నెలల క్రితం పెట్టిన ఒక కేసుకు తప్పుడు సర్టిఫికెట్ జత చేసి 324 సెక్షన్‌ను మార్చి 326 సెక్షన్‌గా చేసి గ్రామ సర్పంచ్ అని కూడా చూడకుండా గంటా కోటేశ్వరరావు, ఆయన ఇద్దరు సోదరులను అన్యాయంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. ఇలా పాత కేసులలో సెక్షన్లు మార్చి తమ పార్టీ వారిని జైళ్లకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రేపు పరిస్థితి ఏంటనేది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని టీడీపీ వారిని హెచ్చరించారు. కొత్తపల్లి గ్రామ నాయకులు ఇగ్గుటూరి రంగారెడ్డి, ముచ్చుమర్రి వెంకటేశ్వరరెడ్డి, దాసరిపల్లి పెద సాంబిరెడ్డి, పడాల హనిమిరెడ్డి పాల్గొన్నారు.

11న అమరేశ్వరునికి అన్నాభిషేకం



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరునికి ఈ నెల 11వ తేదీన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ధనుర్మాసంలో స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా దాతల సహకారంతో సుమారు రెండు క్వింటాళ్ల అన్నంతో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ



పట్టాలు తప్పిన వ్యాగన్‌కి మరమ్మతులు చేస్తున్న దృశ్యం



ఘటనపై వివరాలు తెలుసుకుంటున్న రైల్వే అధికారులు

- యుద్ధ ప్రాతిపదికన గూడ్స్ వ్యాగన్‌కు, ట్రాక్‌కు మరమ్మతులు
- పొందుగుల మీదుగా యథావిధిగా రైళ్లు

దాచేపల్లి: పల్నాడు జిల్లా పొందుగుల రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలు పట్టాలు తప్పటంతో మరమ్మతులు శరవేగంగా జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించేలా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. వివరాలు... పొందుగుల రైల్వేస్టేషన్ సమీపంలో విష్ణుపురం నుంచి నడికుడికి వస్తున్న గూడ్స్ రైలులోని వ్యాగన్ పట్టాలు తప్పింది. లోకో పైలెట్ నడికుడి రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వ్యాగన్‌కి మరమ్మతులు చేయించారు. దాదాపు 4 గంటల పాటు సిబ్బంది శ్రమించి ట్రాక్‌పై రాకపోకలు సాగేలా పనులు పూర్తి చేశారు. మొదటిగా నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పంపించారు. తరువాత మరోసారి ట్రాక్ పరిశీలించి అన్ని రైళ్ల రాకపోకలకు అనుమతులు ఇచ్చారు. గూడ్స్‌రైలులోని వ్యాగన్ పట్టాలు తప్పటంతో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని మాత్రమే తెనాలి మీదుగా విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు దారి మళ్లించారు. డెల్టా, విశాఖ రైలు ఆలస్యంగా నడిచాయి. ఘటన జరిగిన వెంటనే డీఆర్‌ఎం రామకృష్ణ చేరుకుని ట్రాక్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు.

ఎప్పటికప్పుడు పోస్టుపోన్!

అంతా మా ఇష్టం
- ప్రమోషన్ పోస్టుల్లో పక్షపాతం
- ఏళ్లతరబడి కొన్ని భర్తీ చేయటం లేదు
- జీజీహెచ్ అధికారుల పనితీరుపై విమర్శలు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: అంతా మా ఇష్టం.. ఎడాపెడా ఏది చేసినా అడిగేదెవరు? అన్నట్లుగా గుంటూరు జీజీహెచ్ పరిపాలన అధికారులు వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చకపోతే ఐదేళ్లుగా పోస్టు ఖాళీగా ఉన్నా ప్రమోషన్ ద్వారా భర్తీ చేయరు. తమకు నచ్చితే పోస్టు ఖాళీ ఏర్పడి పదిరోజులే అయినా నోటిఫికేషన్ ఇచ్చి ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తారు. ఆస్పత్రి అధికారులు పక్షపాత ధోరణితో సకాలంలో ప్రమోషన్లు రావటం లేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్లుగా ఖాళీ

గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఆరేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో కొన్నింటిని ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయినా ఆస్పత్రి అధికారులు తాత్సారం చేస్తున్నారు. ప్రమోషన్ కోసం కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇచ్చారు. మిగతావారికి ఉద్యోగోన్నతి ఇవ్వలేదు. దీంతో మిగతా సిబ్బంది మళ్లీ కోర్టును ఆశ్రయించారు. సీఎంకు, కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఆస్పత్రి అధికారులు పోస్టుల భర్తీకి ఆసక్తి చూపడం లేదు.


2021 నుంచి రికార్డు అసిస్టెంట్ లేరు

ఆస్పత్రిలో రికార్డు అసిస్టెంట్ పోస్టు 2021 మే నుంచి ఖాళీగా ఉంది. ఆస్పత్రిలో పలువురు నాలుగో తరగతి ఉద్యోగులు ఈ పోస్టుకు అర్హత కలిగి ఉన్నారు. ప్రమోషన్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా అధికారులు కరుణించడం లేదు.

స్వప్రమోషన్ల కోసం పాకులాట

కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాల్సిన కార్యాలయ అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పోస్టుపోన్ చేస్తూ తమ ప్రమోషన్ల కోసం పదే పదే సెక్రటేరియట్ చుట్టూ, డీఎంఈ కార్యాలయం చుట్టూ తిరిగి సాధించుకుంటున్నారు. భర్తీ చేయాల్సిన పోస్టుల జాప్యంపై అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ సుధాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా రెండు వారాల్లో రికార్డు అసిస్టెంట్ పోస్టును, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు.

ప్రచురణ రంగం..!



తెనాలి: పుస్తకం నిజంగా మనకు నేస్తం.. ఒకరకంగా అంతకుమించి అనొచ్చు. 'పుస్తకాలు లేని గది ఆత్మ లేని శరీరం వంటిది' అన్నాడో పెద్దమనిషి. మనం సృజనాత్మకంగా జీవించాలంటే పుస్తకాలు ఉండాలి. ఏదైనా ఒక పుస్తకం చదివితే అందులోని పాత్రలు స్ఫూర్తినిస్తాయి. భావోద్వేగాలను అర్థం చేసుకునే పరిణతి సిద్ధిస్తుంది. వివిధ సందర్భాల్లో అవసరమైన నిర్ణయాలను తీసుకోవడానికి పుస్తక పఠనం కచ్చితంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. సమాజం, పరిసరాలపై అవగాహన కలుగుతుంది. ఇంతటి ప్రాధాన్యం గల పుస్తక పఠనం నేడు తగ్గిపోతోంది. ఫలితంగా ప్రచురణ రంగం కుదేలవుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. విజయవాడలో పుస్తక మహోత్సవం జరుగుతున్న సందర్భంగా పుస్తకావేదన తీర్చాల్సిన తురణం ఇది.

ఒకప్పుడు యమ క్రేజ్

ఒకప్పుడు చరిత్ర, సామాజిక పరిజ్ఞానం, కాల్పనిక సాహిత్య రచనలు పెద్దలు చదివేవారు. అపరాధ పరిశోధన నవలలు సరేసరి! హాట్‌కేకులే.. పెద్దలు చదువుతుంటే, పిల్లలు కూడా వాటిపై దృష్టి పెట్టేవారు. ఊరిలో ఉండే లైబ్రరీకి తరచూ వెళ్లటం, పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని, చదవటం ఒక అలవాటు. పాఠశాల/కాలేజీల్లోనూ లైబ్రరీ అందుబాటులో ఉండేది. దిన, వార, మాసపత్రికలు సహా ప్రముఖ రచయితల రచనలన్నీ లైబ్రరీల్లో లభ్యమయేవి. కాల్పనిక నవలలు, కథాసంకలనాలు, చరిత్ర రచనలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, బాలసాహిత్యం చదివేవారు. పాపులర్ రచనలైతే ఆ డిమాండ్ వేరేగా ఉండేది. అప్పట్లో వచ్చే వారపత్రికలు, దినపత్రికల్లో సీరియల్‌గా వచ్చే నవలల కోసం పాఠకులు ఎదురు చూసేవారు. అన్నీ దాచుకుని, సీరియల్ అయిపోగానే ఆ పేపర్లను ప్రత్యేకంగా నవలగా బైండింగ్ చేయించుకునేవారు. విజయవాడకన్నా ముందే 1950ల్లో తెనాలి ప్రచురణ కేంద్రంగా విరాజిల్లింది. సుప్రసిద్ధ కవులు, రచయితలకు నిలయమైంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వ లైబ్రరీల నిర్వహణ సరిగా లేక పుస్తక పఠనం తగ్గింది.

కాలం మారింది.. చదవడం తగ్గింది

రానురాను కాలం మారుతూ పుస్తకానికేసి చూడడం తగ్గిపోయింది. పిల్లలకు సామాజిక పరిజ్ఞానం, సాహిత్యంపై అభిలాష, చారిత్రక నేపథ్యంపై ఆసక్తిని కలిగించేలా పెద్దల జీవనశైలి ఉండటం లేదు. చిన్నతనం నుంచి పుస్తకాల్ని చదివించాల్సిన అవసరాన్ని గుర్తించటంలో ఇంటి నుంచి బడి వరకు అంతా విఫలమయ్యారు. కార్పొరేట్ పాఠశాలల రంగప్రవేశం, ర్యాంకుల వైకుంఠపాళీలో పిల్లలకు స్కూలు క్లాసులతోనే పొద్దుపోతోంది. కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎక్కడ చూసినా ఇంజినీరింగే. జనరల్ నాలెడ్జి, కరెంట్ ఎఫైర్స్ కోసం కూడా వీళ్లు చదవడం లేదంటే అతిశయోక్తి కాదు. 'గూగుల్ తల్లి'నే అన్నీ అడుగుతున్నారు. మారిన కాలంలో సాఫ్ట్‌వేర్ కొలువులు పుస్తకానికి తీసుకొచ్చిన తంటా ఇది.


పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా ఉంది



పుస్తకాలు వెయ్యి కాపీలు వేసే ప్రొఫెషనల్ పబ్లిషింగ్ ఇప్పుడు లేదు. యూనికోడ్ వచ్చాక ఎవరికివారు అందులో రాసుకుని తక్కువ కాపీలను డిజిటల్ ప్రింటింగ్ చేయిస్తున్నారు. పుస్తకాలను కొనకపోవటంతో వచ్చిన పరిస్థితిది. సామాజికశాస్త్రాలు, రాజకీయ నేపథ్యం ఉన్న పుస్తకాలను అధ్యయనం కోసం కొంటున్నారు. చదివినా చదవకున్నా, ఆధ్యాత్మిక పుస్తకాలు పోతున్నాయి. దళిత సాహిత్యం బాగానే అమ్ముడవుతోంది.

– వెంకటనారాయణ, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ

ప్రభుత్వ సహకారం ఉంటేనే మనుగడ...



ప్రభుత్వ సహకారం ఉంటేనే పుస్తకానికి మనుగడ లభిస్తుంది. లైబ్రరీల ద్వారా పుస్తకాలు కొనుగోలు చేయించాలి. ఎప్పటికప్పుడు డబ్బులు విడుదల చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో లైబ్రరీలను ఏర్పాటుచేయాలి. వాటికీ పుస్తకాలు సరఫరా చేయాలి. వీటితోపాటు మూడేళ్లక్రితం కొనుగోలు చేసిన పుస్తకాలకు డబ్బులు వెంటనే విడుదల చేయాలి.

– బి.రవికుమార్, నవరత్న బుక్‌హౌస్, విజయవాడ

నవతరం దారి మళ్లింది..



నవతరం పుస్తక పఠనం నుంచి దారిమళ్లింది. సంపాదనే ముఖ్యమైంది. మానవీయ విలువలపై అవగాహన లేకుండాపోయింది. తెలుగు భాషాసంస్కృతులపై చిన్నచూపు ఏర్పడింది. వ్యక్తిగత స్వార్థం పెరిగి, సాహిత్య పఠనం లేక జరుగుతున్న అనర్థాలివి. గ్రంథాలయాలను ఆధునికీకరించి, పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచేలా చేసినపుడే మంచి రోజులొస్తాయి. మా ప్రయత్నం అందుకే.

– వల్లూరు శివప్రసాద్, కన్వీనర్, గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ వేదిక

పాఠశాల బస్సును ఢీకొట్టిన లారీ

కొల్లూరు: అతి వేగంగా దూసుకొచ్చిన లారీ ఓ పాఠశాల బస్సును ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరులోని శ్రీ సాయి వాసవి విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సు మండలంలోని క్రాప నుంచి కొల్లూరు వస్తుంది. కొల్లూరు శివారు బోసునగర్ వద్ద విద్యార్థులను ఎక్కించుకునేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపాడు. అదే మార్గంలో తెనాలి నుంచి ఇటుకరాయి కార్మికులను ఎక్కించుకొని వస్తున్న లారీ ఈ బస్సును వెనుక నుంచి ఢీకొంది. విద్యార్థులు ఎం.కౌషిక్, కె.సంపత్‌నాయక్, ఎం.జస్వంత్ సాయి, వై.దుర్గ, డి.ప్రేమ్‌కుమార్, టీచర్ బి.వెంకటపద్మలకు స్వల్ప గాయాలయ్యాయి.



క్లుప్తంగా

నవ భారత నిర్మాణానికి ముందడుగు వేద్దాం



రెంటచింతల: స్వామి వివేకానంద కలలు కన్న నవభారత నిర్మాణానికి యువకులు ముందడుగు వేయాలని మాచర్ల శ్రీ రామకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందురెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తుమృకోట గ్రామంలో సమితి శాఖను ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ రామకృష్ణ మిషన్ స్వామీజీల ఆదేశాల మేరకు రామకృష్ణ, శారదామాత, స్వామి వివేకానందల భావజాలాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు గ్రామాలలో ఈ సేవా శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తుమృకోట నూతన కమిటీని నియమించారు.

హుండీ కానుకల దొంగతనం

పోలీసుల అదుపులో నిందితుడు?

గురజాల రూరల్: దేవాలయంలో హుండీని పగులగొట్టి కానుకలు దొంగతనం చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండల పరిధిలోని దైద గ్రామంలో వేంచేసియున్న అమర లింగేశ్వరస్వామి వారి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని యువకుడు హుండీని పగులగొట్టాడు. హుండీలో ఉన్న దాదాపు రూ.4 వేలు తీసుకుని పులిపాడు గ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దేవాలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. పులిపాడు గ్రామంలోని వైన్ షాపు సమీపంలో పోలీసులు ఉండటాన్ని గమనించిన యువకుడు పరిగెత్తి వెళ్లి సమీపంలోని చెరువులోకి దూకాడు. స్థానికులు బయటకు తీసి పోలీసులకు అప్పగించారని సమాచారం.

అశ్లీలత నిరోధానికి చర్యలు తీసుకోవాలని వినతి

నరసరావుపేట: త్వరలో రానున్న కోటప్పకొండ తిరునాళ్లలో అశ్లీల డాన్సులను నివారించడం, స్వాతి వీక్లీపై నమోదైన కేసుల విచారణను వేగిర పరచడం, సంప్రదాయ, సామాజిక మాధ్యమాల్లో అసభ్య కంటెంట్‌ను నివారించడం వంటి వాటిపై సమీక్షించేందుకు ఉద్దేశించిన జిల్లాస్థాయి అశ్లీలత నిరోధక విభాగాన్ని వెంటనే సమావేశపరచాలని అశ్లీలత ప్రతిఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌ను కలసి వినతి పత్రం అందజేసినట్లు మంగళవారం పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్ 30న అప్పటి కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన మొదటి సమావేశం జరిగిందని గుర్తుచేశారు. రెండు నెలల క్రితమే వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఇంతవరకు మళ్లీ సమావేశం నిర్వహించలేదని వాపోయారు. తాము విజ్ఞప్తి చేసిన తర్వాత త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గోపీచంద్ తెలిపారు.

క్రీడలపై పట్టు సాధిస్తేనే విజయం



కపోతాలను ఎగురవేస్తున్న వడ్లమాని రాజ్యలక్ష్మి, బాలగంగాధర్ రెడ్డి



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పిడుగురాళ్ల రూరల్: విద్యార్థి దశలో ఏ క్రీడను ఎంచుకున్నా దానిపై పట్టు సాధిస్తేనే విజయం సాధ్యమని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని గీతికా సీబీఎస్‌సీ స్కూల్‌లో జిల్లా స్థాయి రోటరీ ఇంట్రాక్ట్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం నిర్వహించారు. 15 మండలాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్ వంటి గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... గెలుపోటములు సహజమని, ఓడిపోయినా పాఠాలు నేర్చుకొని విజయానికి కృషి చేయాలని అన్నారు. స్కూల్ చైర్మన్ బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యతోపాటు క్రీడలలో నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకట రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడు తిరునాళ్ల

విద్యుత్ కాంతులీనుతున్న ముగ్గురు రాజుల దేవాలయం



అలంకరణలో రాజుల దేవాలయం



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నం

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు బుధవారం ముగ్గురు రాజుల తిరునాళ్లకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ముగ్గురు రాజుల దేవాలయం విద్యుత్ దీపాలతో వెలుగులీనుతోంది. దీంతో అమరావతి – సత్తెనపల్లి రహదారిపై సందడి వాతావరణం నెలకొంది. గత 27 సంవత్సరాలుగా ఈ మహోత్సవం ఏటా నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బాలయేసును సందర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ రెవరెండ్ పి.రాజారెడ్డి మాట్లాడుతూ... తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. దివ్యపూజ బలిని గుంటూరు పీఠాధిపతులు మహాఘన రైట్ రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. పలు విచారణ గురువులు, మఠకన్యలు పాల్గొంటారన్నారు. అనంతరం కొవ్వొత్తులు, కానుకల సమర్పణ, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నట్లు రాజారెడ్డి, సహాయ గురువులు బాల ధీరజ్‌లు పేర్కొన్నారు.

ఇంధన రంగంలో అవకాశాలపై వీవీఐటీలో సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ దిన్నే గిరిధర్ కుమార్

పెదకాకాని: పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలని ఎనర్జీ ఇండస్ట్రియల్ టర్బో మిషనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ దిన్నే గిరిధర్‌కుమార్ పేర్కొన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మంగళవారం ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్– ఇంధన రంగంలో అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్ గిరిధర్ కుమార్ దిన్నే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పురోగమనాలు, ప్రపంచ పర్యావరణ ఆందోళన కారణంగా ఇంధన రంగం గణనీయమైన మార్పులకు లోనవుతుందన్నారు. ఫలితంగా ఇంధన పరిశ్రమలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.గ్యాస్ టర్బైన్ వ్యవస్థ నిర్వహణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 26వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ (2 + 2 పుష్ బ్యాక్) బస్సు బయలు దేరుతుందని డిపో మేనేజర్ జీఎస్ఎస్‌వీ కుమార్ మంగళవారం తెలిపారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 27న తెల్లవారుజామున అరుణాచలం చేరుతుందన్నారు. దర్శనం అనంతరం తిరిగి కంచి మీదుగా 28న ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి రూ.2,100గా నిర్ణయించామన్నారు. వివరాలకు 99592 25429, 73828 97583 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐఎంఏ సభ్యుడి కుటుంబానికి చెక్కు అందజేత



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐఎంఏ శాఖ సభ్యుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. 2021 నుంచి ఆయన సభ్యుడిగా ఉండటంతో ఐఎంఏ నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీం సభ్యత్వం కలిగి ఉన్నారు. దీంతో రూ. 11.37 లక్షల మేరకు చెక్కును శ్రీరామూర్తి కుమారుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావుకు మంగళవారం శాఖ అధ్యక్షుడు దూళ్లిపాళ్ల భరత్‌కుమార్ అందించారు. కార్యదర్శి డాక్టర్ బొర్రా రాంప్రసాద్ వెంట ఉన్నారు.

పంట కాలువలో పడి రైతు మృతి



అంబటి సత్యం (ఫైల్)

మాచవరం: ప్రమాదవశాత్తు పంట కాలవలో పడి రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో మంగళవారం చోటు చేసుకుంది. మాచవరం గ్రామానికి చెందిన అంబటి సత్యం (40) పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఆకురాజుపల్లి మేజర్ కాలువ పరిధిలోని విశ్వనాథ్ డ్రాపు సమీపంలో కాల్వకు అడ్డుకట్ట వేస్తుండగా కాలు జారి కాలువలో పడిపోయాడు. నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయాడు. నీట మునిగి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

15 నుంచి రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుదే పాండురంగారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రామస్తుల సహకారాలతో మూడేళ్లుగా నాటిక పోటీలు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగురోజులపాటు నిర్వహించే పోటీల్లో మొదటి నాటికగా 15వ తేదీ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే 'ఐ హేట్ ఇండియా, రెండో నాటిక సద్గురు కళానిలయం గుంటూరు వారిచే 'కమనీయం', 16వ తేదీ యంగ్ థియేటర్ విజయవాడ వారిచే '27వ మైలురాయి', వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారిచే 'నిశి', 17వ తేదీ స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే 'కొండంత అండ', శ్రీకారం రోటరీ కళాపరిషత్ వారిచే 'ఏది నిజం', 18వ తేది చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారిచే '(అ)సత్యం', సాయి ఆర్ట్స్ కొలకలూరివారిచే 'జనరల్ బోగీలు' నాటికలు ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

లారీపై నుంచి పడి డ్రైవర్ మృతి

అద్దంకి రూరల్: ప్రమాదవశాత్తూ లారీపై నుంచి కాలు జారిపడి లారీ డ్రైవర్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన మహమ్మద్ అబ్బాస్ (45) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన లారీలో గుంటూరు నుంచి పత్తి విత్తనాలు లోడ్ చేసుకుని బయలుదేరాడు. సరుకును అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి గ్రామంలోని శ్రీవాత్సవ బయోటెక్ లిమిటెడ్ కంపెనీకి 4వ తేదీ సాయంత్రం అప్పగించాడు. ఈ క్రమంలో లారీ క్యాబిన్ పైకి ఎక్కి టార్పాలిన్ పట్టను మడత వేస్తూ ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం మృతుని కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కోడి పందేల నిర్వహణ చట్టరీత్యా నేరం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



కోడిపందేల నిషేధంపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో కోడి పందేలు నిర్వహించటం, పందేలు కాయటం, అవి చూసేందుకు వెళ్లటం చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కోడి పందేలపై ప్రజలను హెచ్చరిస్తూ రూపొందించిన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, సెక్షన్ 10/1974 ప్రకారం కోడి పందేలు నిర్వహించుట చట్టరీత్యా నేరమని అన్నారు. అందులో పాల్గొన్నవారికి, ప్రోత్సహించిన వారికి, నిర్వహించే స్థలం వారికి కూడా ఈ నిషేధం వర్తిస్తుందన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.కాంతారావు, డీపీవో ఎం.వి.భాస్కరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయండి

నరసరావుపేట: వచ్చే మార్చి నాటికి జిల్లాలో కనీసం రెండు వేల మందికి స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఈడీ మయూరి, ఎల్డీఎం రాంప్రసాద్‌లతో జిల్లా కలెక్టర్ డీసీసీ సమావేశం నిర్వహించారు. వెయ్యి మందికి పైగా బీసీలకు, మరో వెయ్యి మంది ఈబీసీ, అగ్ర (రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, క్షత్రియ) కులాలకు చెందిన వారికి స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయాలన్నారు. మూడు నెలల కాలంలో మొత్తం రూ.50 కోట్ల రుణాలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. రేషన్ కార్డు కలిగి, రుణాలు ఆశించిన వారితో 16వ తేదీ వరకు ఆన్‌లైన్ బెనిఫిషియరీ మానిటరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓబీఎంఎంఎస్)లో రిజిస్ట్రేషన్లు చేపట్టాలన్నారు.

పెన్షన్ల తనిఖీలు ప్రారంభం

నరసరావుపేట రూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల తనిఖీలను మండలంలో మంగళవారం ప్రారంభించారు. మొదటిగా ఆరోగ్య పెన్షన్ల తనిఖీ నిర్వహిస్తున్నారు. లింగంగుంట్లలో కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పర్యవేక్షించారు. ములకలూరు గ్రామంలో తనిఖీల్లో డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కరరెడ్డి, డీఎంహెచ్‌వో రవి, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, తహసీల్దార్ వేణుగోపాల్, డాక్టర్ అయ్యప్ప నాయుడు, డాక్టర్ లక్ష్మికాంత్‌లు పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

నరసరావుపేట ఈస్ట్: అంధుల పాలిట లూయిస్ బ్రెయిలీ ఆరాధ్య దైవంగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు తెలిపారు. బ్రెయిలీ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ప్రకాష్‌నగర్‌లోని లూథరన్ అంధుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు సువార్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించి విద్యార్థులకు క్రికెట్ కిట్లు, ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ, ఐఈడీ కోఆర్డినేటర్ సిల్వరాజ్, తహసీల్దార్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, విద్యార్థి సంఘాల నాయకులు రంగారెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారం దోపిడీ కేసులో ఇద్దరు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: మహిళను బెదిరించి ఆటోలో తీసుకెళ్లి బంగారు ఆభరణాలు దోచుకున్న కేసులో ఇద్దర్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ పి.శ్రీనివాసరావు ఈ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... గత నెల 26న తెల్లవారుజామున పట్టణంలోని రంగా కాలనీకి చెందిన మొగిలిశెట్టి మల్లేశ్వరి అమరావతికి వెళ్లడానికి బస్సులు ఆగే ప్రాంతంలో ఉన్నారు. ఆటోలో వచ్చిన ఇద్దరు తెలిసిన వారిలా మాట కలిపి వాహనంలో ఎక్కించుకుని సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ శివారు వద్దకు వచ్చాక బెదిరించారు. బంగారు నగలు లాక్కుని పారిపోయారు. బాధితురాలు సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులైన ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన నన్నెబోయిన చిరంజీవి, గుంటూరు నగరాలుకు చెందిన తమ్మిశెట్టి వినోద్‌లను మంగళవారం ఉదయం గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు గొలుసు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్, హెచ్‌సీ గుమ్మా నాగేశ్వరరావు, పీసీ ఓర్సు శ్రీనివాస రావు, హెచ్‌జీ నాగరాజునాయక్ ఈ కేసు ఛేదనకు కృషి చేశారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

క్లాప్ మిత్రల వినూత్న నిరసన



సచివాలయంలో క్లాప్ మిత్రలు పోసిన చెత్త

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో మంగళవారం క్లాప్ మిత్రలు వినూత్న నిరసన తెలుపుతూ చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించకుండా సచివాలయానికి తీసుకొచ్చారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌లుగా మాదాసు సుబ్బయ్య, కొమ్ము రామారావు, కందుకూరి యిరీమ్మయాలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా వేతనాలు సక్రమంగా అందకపోవడంతో ఇలా నిరసన తెలిపారు. సర్పంచ్ బ్రహ్మానాయక్, గ్రీన్ అంబాసిడర్ల మధ్య వాగ్వివాదంతో చెత్తను సచివాలయానికి తరలించి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడటంతో నిరసన విరమించారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించారు. పంచాయతీ సర్పంచ్ బ్రహ్మానాయక్, కార్యదర్శి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. గతంలో ఐదు నెలల వేతనాలు చెల్లించామని, మరో 4 నెలలవి చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామంలో నిధుల విషయంపై పంచాయతీ అధికారులకు గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేయడంతో పంచాయతీ రికార్డులు జిల్లా పంచాయతీ అధికారి వద్ద తనిఖీలో ఉన్నాయని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లకు రావాల్సిన వేతనాలు సక్రమంగా చెల్లిస్తామన్నారు.

18న నవోదయ ఎంపిక పరీక్ష

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ పీఎంశ్రీ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. 2025– 26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 బ్లాకుల్లోని 23 కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల్లోగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు 10.45 నుంచి 11:30 గంటల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఇస్తామని చెప్పారు. పరీక్ష రాసేందుకు 4,916 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారు navodaya.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ నంబరు, పుట్టినతేదీ నమోదు చేసి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యల ఏర్పడితే మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ కార్యాలయ హెల్ప్‌డెస్క్ నంబర్లు 90143 07677, 94763 15598కు కాల్ చేయాలని తెలిపారు.

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా నారదముని

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్త డెప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లాలోని పలువురికి స్థాన చలనం కలిగింది. జిల్లా ప్రత్యేక కలెక్టర్ (డాక్టర్ కేఎల్ రావు సాగర్ – పులిచింతల ప్రాజెక్ట్)గా వెయిటింగ్‌లో ఉన్న బి.గాయత్రీదేవి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆ పోస్టులో పనిచేసిన డెప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావును జిల్లా స్కూలు ఎడ్యుకేషన్ సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీగా నియమించారు. పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ పీఏగా పనిచేసిన డెప్యూటీ కలెక్టర్ నారదమునిని పల్నాడు జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి. ఆయన స్థానంలో డెప్యూటీ కలెక్టర్ పదోన్నతిపై ఆర్.రమేష్‌బాబు నియమితులయ్యారు.

లారీ డ్రైవర్లపై దాడి చేసిన ముఠా అరెస్ట్



దారిదోపిడీ ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోగినేని

బాపట్ల: రాత్రి సమయాలలో దారి దోపిడీ చేస్తూ లారీ డ్రైవర్లపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు చెప్పారు. బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల పట్టణం రైలుపేటకు చెందిన షేక్ మాధర్, చేగుడి ఆనంద్, మహమ్మద్ ఇక్బాల్, షేక్ బాషీద్‌లు గతంలో చీరాల, రేపల్లె, బాపట్ల, తెనాలి ప్రాంతాలలో అనేక నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున బాపట్ల పట్టణంలోని ధనలక్ష్మి రైస్ మిల్లు వద్ద నుంచి లారీ ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామానికి చెందిన రావూరి వాసు ఊక లోడుతో గుంటూరు రోడ్డులో వెళ్తున్న సమయంలో పై నిందితులు కొండబోట్లవారిపాలెం అడ్డదారిలో దారి కాచి వాహనాలు ఆపి లారీ డ్రైవర్ వద్ద ఉన్న రూ.1500 నగదు, రెండు సెల్ ఫోన్లు తీసుకొని ఆయుధంతో దాడి చేసి పారిపోయారన్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు


కొరిటిపాడు (గుంటూరు): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి డి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడానికి విక్రయాలు పెరిగేలా ఈ తగ్గింపు అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత చీరలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అన్ని ఆప్కో విక్రయ శాలలతోపాటు ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్, ఆమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల వెబ్‌సైట్‌లో కొనుగోలు చేసి చేనేత పరిశ్రమకు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకంతో భాషపై పట్టు




చీరాల: ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు ఎంతో దోహదపడతాయని సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ బి.మోజెస్ అన్నారు. చీరాలలోని వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీలో జిల్లాస్థాయిలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులు, సీనియర్ రిటైర్డ్ హెచ్ఎం ఎర్ర సత్యనారాయణ రచించిన స్పోకెన్ ఇంగ్లిష్, ప్రిపోజిషన్ అనే ఆంగ్ల నూతన పుస్తకాలను కోర్సు డైరెక్టర్ అజయ్‌కుమార్, మోజెస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో చక్కగా రూపొందించిన రెండు పుస్తకాలను ఉపయోగించుకోవాలన్నారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎం.సుభాని మాట్లాడుతూ చాలా కాలం నుంచి సత్యనారాయణ ఆంగ్ల పుస్తకాలను రూపొందించి అందరికీ ఉపయోగపడే విధంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముత్తాయిపాలెం హెచ్ఎం గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నుంచి ఉద్యోగ విరమణ చేసినప్పటికి ఆయన అకుంఠిత దీక్షతో ఇప్పటి వరకు 117 ఆంగ్ల పుస్తకాలను రచించారన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఎంఈవో సత్యనారాయణ, డి.మాధవీలత, పి.రాజు, వై.నాగవర్ధనరావు, రిసోర్సు పర్సన్లు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పసికందు మృతదేహం



డ్రెయినేజీలో పడి ఉన్న పసికందు



మరణించిన పసికందు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో దారుణం చోటుచేసుకుంది. గంగాలమ్మ గుడి సమీపంలో డ్రెయినేజీలో మంగళవారం మగ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మురుగునీటిలో శిశువు పడి ఉండడాన్ని పోలీసులు వచ్చేదాక చూడలేని ఓ మహిళ బయటకు తీసి ఒడిలో పెట్టుకుంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు పసికందు మరణించినట్టు గుర్తించి వీఆర్వో తులసి సాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే ఎవరైనా పడేసి ఉంటారా అని అనుమానిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. శిశువును చంపి కాలువలో పడవేశారా లేదా కాలువలో పడవేసిన తరువాత శిశువు మృతి చెందిందా అనేది పోస్టుమార్టం తర్వాత నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం నిర్ధారిస్తామని సీఐ కళ్యాణరాజు తెలిపారు.